సాక్షి సిద్దిపేట

శుక్రవారం । 6 । అక్టోబర్ । 2023



ప్రకంపనలతో బెంబేలు

జిల్లాలోని కోహీర్ మండలంలో భూప్రకంపనలు స్థానికులను భయకంపితులను చేస్తున్నాయి. వివరాలు 8లో ▸



అపరిచితులను నమ్మొద్దు

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని శాంతి భద్రతల అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి సూచించారు. వివరాలు 8లో ▸



అన్ని పండుగలకు ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం అన్ని పండుగలకు ప్రాధాన్యం ఇస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

మల్లన్న సన్నిధిలో మంత్రి సత్యవతి రాథోడ్



స్వామి వారిని దర్శించుకుంటున్న మంత్రి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామిని మంత్రి సత్యవతి రాథోడ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉండాలని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఒగ్గు పూజారులు డోలు మేళాలతో, అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈవో అంజయ్య, ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్, జెడ్పీటీసీ సిద్దప్ప, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పల్లాను కలిసిన మాజీ ఎమ్మెల్యే



పల్లాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ చేసేలా కృషి చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే కాటం లింగయ్య గురువారం ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కోరారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే చేర్యాల పూర్వ వైభవం, ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పల్లాకు వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన పల్లా త్వరలోనే రెవెన్యూ డివిజన్ కల సాకారం అవుతుందని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

'గృహలక్ష్మి' పేదలకు వరం

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



లబ్ధిదారులకు ప్రొసిడింగ్‌లను అందజేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: పేదలకు సొంతింటి కలను నిజం చేయడానికి గృహలక్ష్మి పథకం వరంగా మారిందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్‌లోని ఐవోసీ (ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్)లోగల ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు గృహలక్ష్మి ప్రొసిడింగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ సాహసోపేత నిర్ణయాలతో ముందుకు సాగుతున్నారని కొనియాడారు. సీఎం కేసీఆర్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గానికి ప్రత్యేకంగా 10వేల ఇళ్లు మంజూరు చేయడం హర్షణీయమని అన్నారు. ప్రభుత్వ సహకారాన్ని అందిపుచ్చుకొని సొంతింటి కలను నిజం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, జెడ్పీటీసీ మల్లేశం, బీఆర్‌ఎస్ గజ్వేల్ మండల శాఖ అధ్యక్షుడు మధు, సర్పంచ్‌లు చంద్రమోహన్‌రెడ్డి, మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, తోట లక్ష్మణ్, సుధా మాదయాకర్‌రెడ్డి, బాల్‌చంద్రం, ఎంపీటీసీలు అశోక్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి క్రీడాసంఘాలకు స్పోర్ట్స్ కిట్లను సైతం అందజేశారు.

19న బయోగ్రఫీ క్విజ్

సిద్దిపేటజోన్: జమాయత్ ఉల్ ఉలేమా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 19న బయోగ్రఫీ క్విజ్‌పై పరీక్ష స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ముఫ్తి అబ్దుల్ సలాం ఖాస్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో ఉంటుందని, ప్రతిభ చూపిన వారికి బహుమతులు ఉంటాయని, నమోదు కోసం ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరంలేదన్నారు. పట్టణంలోని మదినస్టోర్(ధోభీగల్లీ), సోహా ఎలక్ట్రికల్ (చార్వాదాన్ వీధి)సాజిద్ పూర మదర్సాలలో సంప్రదించాలని సూచించారు. అన్ని మతాలవారు పాల్గొనవచ్చన్నారు.

చింత వద్దు.. చెంతనే వైద్యం

- ప్రాణాంతక వ్యాధులకూ చికిత్స ఇక్కడే
- గాంధీ తరహా అందనున్న ఆధునిక సేవలు
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు
- వెయ్యి పడకల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ప్రారంభించిన మంత్రి



వెయ్యి పడకల ఆస్పత్రి ప్రారంభించిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటకమాన్: ఇక చింత వద్దని, చెంతనే ఆధునిక వైద్యం అందనుందని, స్థానికంగానే ప్రాణాంతక వ్యాధులకూ వైద్య సేవలు అందనున్నాయని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మండల పరిధిలోని ఏన్సాన్‌పల్లి శివారులో వెయ్యి పడకల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి భవనాన్ని మంత్రి గురువారం ప్రారంభించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ విమలాథామస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్‌తో కలిసి మంత్రి అన్ని విభాగాల్లో కలియతిరిగారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థులతో మంత్రి మాట్లాడారు. అనంతరం రూ.15కోట్లతో నిర్మించనున్న క్యాన్సర్ బ్లాక్ భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. వెయ్యి పడకల ఆస్పత్రితో ఆధునిక వైద్యం అందనున్నాయని, గతంలో క్యాన్సర్ బారిన పడిన వారు వైద్య చికిత్స నిమిత్తం హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడేవారు. నేడు ఆ బాధలు తీరనున్నట్లు మంత్రి తెలిపారు. కిడ్నీ బాధితులకు అందించే డయాలసిస్ సేవలను 10 పడకల నుంచి 40 పడకలకు పెంచుతున్నట్లు తెలిపారు.

క్రిటికల్ కేర్ బ్లాక్..

ఈ ఆస్పత్రిలోనే రూ.23 కోట్లతో 50పడకల సూపర్ స్పెషాలిటీ క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. కిడ్నీ, గుండె సంబంధిత చికిత్స, క్యాన్సర్ బాధితులకు ఉచితంగా వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 875 మంది (ఎంబీబీఎస్, పీజీ) వైద్య విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. ఆసుస్పత్రిలో షిఫ్టుల వారీగా 280 మంది వైద్యులు విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఎంబీబీఎస్ పూర్తయిన వారు ఇంటర్న్‌షిప్‌గా 150 మంది డాక్టర్లు అందుబాటులో ఉంటారన్నారు. ఆస్పత్రి ఏర్పాటుతో నా జన్మధన్యమైందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, జెడ్పీ చైర్‌పర్సన్ రోజరాధాకృష్ణశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు, సుడా చైర్మన్ మారెడ్డి రవిందర్‌రెడ్డి, నర్సింగ్ కౌన్సిల్ మెంబర్ పాల సాయిరాం, మార్కెట్ కమిటీ చైర్మన్ విజితవేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నూతన ఆస్పత్రిలో డాక్టర్లతో మాట్లాడుతున్న మంత్రి

ఓటుతో బుద్ధి చెబుదాం

సిద్దిపేటజోన్: సిద్దిపేట ప్రగతిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని, రాబోయే ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని మంత్రి హరీశ్ రావు అన్నారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో చిన్నకోడూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గణేశ్, మైలారం గ్రామానికి చెందిన ఎన్నారై శ్రావణ్ రెడ్డి, నంగునూర్ మండలానికి చెందిన బీజేపీ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి తదితరులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉందని, దీన్ని చూసి బీజేపీ, కాంగ్రెస్‌లు ఓర్వలేనితనంతో ఊగిపోతున్నాయన్నారు.

తొలి మార్కెట్..

మేక తల, కాళ్లు శుభ్రం చేసేందుకు ప్రత్యేకంగా రాష్ట్రంలోనే తొలి మార్కెట్ సిద్దిపేటలో ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ లో ప్రత్యేకంగా మేక తల, కాళ్లు శుభ్రం చేసే కాంప్లెక్స్, రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ కార్యాలయం, గోదాం లను మంత్రి ప్రారంభించారు.

మా గ్రామాలకు గోదావరి జలాలేవీ?

- ప్రజాప్రతినిధుల వాహనాలను అడ్డుకున్న బందారం వాసులు
- నాయకులకు, స్థానికుల మధ్య తోపులాట
- చేసేదిలేక కాలి నడకన వెళ్లి అభివృద్ధి పనులు ప్రారంభించిన నేతలు



ఎమ్మెల్సీ యాదవరెడ్డి, డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డిలతో స్థానికుల వాగ్వాదం

కొండపాక(గజ్వేల్): మా గ్రామాలకు సైతం గోదావరి జలాలు తరలించాలంటూ బందారం వాసులు గురువారం ప్రజాప్రతినిధుల వాహనాలను అడ్డుకుని నిరసనకు దిగారు. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులకు, స్థానికుల మధ్య తోపులాట జరిగింది. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్రజా ప్రతినిధుల వాహనాలకు అడ్డంగా బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల చెరువులకు గోదావరి నదీ జలాలు వచ్చేలా కాలువలు తవ్వారని, కానీ బందారం, అంకిరెడ్డిపల్లి, దుర్గా గ్రామాలను విస్మరించారంటూ మండిపడ్డారు. ఈ విషయమై పలు మార్లు మంత్రికి విన్నవించినా పట్టించుకోవడంలేదన్నారు. చెరువులకు నీరు రాకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయి పంటలు ఎండి పోతున్నాయని, దీంతో అప్పుల పాలవుతున్నామన్నారు. గ్రామంలో డబుల్ బెడ్రూంలు కూడా నిర్మించలేదన్నారు. గ్రామం మధ్యలోంచి వెళ్లే రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి ఎలాంటి నష్ట పరిహారం ఇవ్వడం లేదన్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కారం అయ్యే వరకు గ్రామానికి ప్రజా ప్రతినిధులు వచ్చేదిలేదంటూ గ్రామస్తులు పట్టుబట్టారు. దీంతో ప్రజా ప్రతినిధులకు, గ్రామస్తులకు కొద్ది సేపు వాగ్వాదం జరిగి తోపులాటకు దారి తీసింది. ఎమ్మెల్సీ యాదవరెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డిలు సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తామంటూ నచ్చజెప్పినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ప్రజా ప్రతినిధులు వాహనాలు అక్కడే వదిలి కాలినడకన వెళ్లి పలు అభివృద్ధి పనులు, కుల సంఘాల భవనాలను ప్రారంభించారు.

కలకలం రేపిన ఫ్లెక్సీ..

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు కేవలం బీఆర్‌ఎస్ నాయకులకు, కార్యకర్తలకే చెందుతున్నాయంటూ గ్రామంలో వెలిసిన ఫ్లెక్సీ కలకలం రేపింది. కేవలం కార్యకర్తలు ఓట్లు వేస్తేనే కేసీఆర్ సీఎం అయ్యారా? ఇదెక్కడి న్యాయమంటూ గ్రామస్తులు మండిపడ్డారు. గ్రామంలో ఎలాంటి ప్రారంభోత్సవాలు చెయ్యవద్దంటూ ప్రజా ప్రతినిధులు గో బ్యాక్ అంటూ ఫ్లెక్సీ వెలువడంతో పలువురు ప్రజా ప్రతినిధులు ఖంగుతున్నారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ముదిరాజుల సంక్షేమానికి ప్రాధాన్యం



ముదిరాజ్ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి

సిద్దిపేటఅర్బన్: ముదిరాజ్‌ల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, సద్దిపేటలో ముదిరాజ్‌ల కోసం నిర్మించిన ఏసీ కన్వెన్షన్ హాల్ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. పొన్నాల పరిధిలోని టీహెచ్‌ఆర్ నగర్‌లో నిర్మించిన ముదిరాజ్ ఫంక్షన్ హాల్ ను శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌తో కలిసి ప్రారంభించారు. ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ మాట్లాడుతూ సిద్దిపేటలో ఫిష్ ఫుడ్ కోర్టు ఏర్పాటు చేసే దిశగా మంత్రి కృషి చేయాలని కోరారు.

'రుతు ప్రేమ' దేశానికే ఆదర్శం



రుతుప్రేమ యాప్ ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్ రావు

సిద్దిపేటజోన్: మహిళా చైతన్యానికి సిద్దిపేట పునాది వంటిదని మంత్రి హరిశ్ రావు అన్నారు. గురువారం స్థానిక విపంచి ఆడిటోరియంలో రుతు ప్రేమ యాప్‌ను జెడ్పీచైర్‌పర్సన్ రోజా శర్మ, పోలీస్ కమిషనర్ శ్వేత, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కోసం ఏదైనా ఒక మంచిపని చేయాలనే సంకల్పంతో రుతు ప్రేమ ఇక్కడ శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. నాడు ఒక్కరూ, ఇద్దరితో మొదలై నేడు రాష్ట్ర స్థాయిలో ఒక యజ్ఞం తరహాలో ఈ కార్యక్రమానికి స్పందన లభిస్తోందన్నారు. రుతు ప్రేమ కార్యక్రమంతో దేశానికి సిద్దిపేట ఆదర్శంగా నిలవబోతుందని అన్నారు. రూ.1.53 కోట్లు వెచ్చించి సిద్దిపేట ప్రాంతంలో 53వేల మంది మహిళలకు రుతు స్రావ కప్పులు, క్లాత్ ప్యాడ్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఐరన్ లోపంతో బాధపడుతున్న వారికి పోషకాహార కిట్స్ పంపిణీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఎస్సీ గురుకుల పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ప్రస్తుతం వంద మందికి ల్యాబ్ ట్యాబ్‌లు ఇస్తున్నట్టు, భవిష్యత్తు లో మరో 900మందికి ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘోత్తమ్ రెడ్డి, డీపీఓ దేవకీదేవి, బీసీ సంక్షేమ శాఖ అధికారి సరోజ, సెట్విన్ ఇన్‌చార్జ్ అమినా, జిల్లా వైద్యాధికారి కాశీనాథ్, డాక్టర్ శాంతి, మున్సిపల్ చైర్మన్ మంజుల, కౌన్సిలర్ కవిత పాల్గొన్నారు.

ఆశావర్కర్ల డిమాండ్లు నెరవేర్చండి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి
- కలెక్టరేట్ ముట్టడి, స్వల్ప ఉద్రిక్తత



కలెక్టరేట్‌లోకి చొచ్చుకుపోయే ప్రయత్నం చేస్తున్న ఆశా కార్యకర్తలు

సిద్దిపేటరూరల్: ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాల స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా గురువారం కలెక్టరేట్ కార్యాలయ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. బారికేడ్లను నెట్టేసి గేట్లు ఎక్కబోయిన ఆశ కార్యకర్తలతో కలెక్టరేట్ వద్ద ఆందోళన నెలకొంది. దీంతో పోలీసులకు ఆశా కార్యకర్తలకు స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం గోపాల స్వామి మాట్లాడుతూ ఆశాల న్యాయమైన డిమాండ్ ను పరిష్కరించాలని కోరుతూ11 రోజుల కాలంగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, పీఎఫ్ , ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ. 5లక్షలు, ఇన్సూరెన్స్ సౌకర్యం రూ. 5 లక్షలు అందివ్వాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమ్మె చేస్తున్న నాయకులతో చర్చలు జరిపి డిమాండ్లు నెరవేర్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, జిల్లా కమిటీ సభ్యుడు బాలసయ్య, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శిప్రవీణ, జిల్లా ఉపాధ్యక్షురాలు రెడ్డబోయిన బాలమణి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి గోబ్యాక్..



గొర్రెల మందను అడ్డుగా పెట్టి నిరసన తెలుపుతున్న గొల్ల కురుమలు

గొర్రెల మందను నిలిపి నిరసన తెలిపిన గొల్ల కురుమలు

దౌల్తాబాద్(దుబ్బాక): మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డికి గురువారం నిరసన సెగ ఎదురైంది. పర్యటనలో భాగంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాకు ఎంపీ చేరుకోగానే గొల్ల కురమలు గొర్రెల మందను అడ్డుగా నిలిపి నిరసన తెలిపారు. ఎంపీ గోబ్యాక్.. కేసీఆర్ డౌన్, డౌన్ అంటూ నినాదాలు చేశారు. మూడో విడత సబ్సిడీపై గొర్రెలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కురుమ సంఘం సభ్యులు, బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పూలే విద్యార్థినులు భళా..



అనూష



సమ్మక్క



సీహెచ్ భాగ్యవతి



సౌజన్య



దివ్య

పోలీసులుగా ఎనిమిది మంది ఎంపిక

వర్గల్(గజ్వేల్): కానిస్టేబుల్ ఫలితాలలో వర్గల్ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. చదువుకుంటూనే పరీక్షకు సన్నద్ధమయ్యారు. చక్కని ప్రతిభతో 8 మంది విద్యార్థినులు పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. కె.దివ్య (బీఏ), జె. సౌజన్య (బీబీసి), సీహెచ్ భాగ్యవతి (ఎంఎస్‌డీఎస్) ఫైనల్ ఇయర్ చదువుతూ ఉద్యోగం సాధించారు. ఎం. వనిత (ఎంపీసీఎస్), కె.సవిత (బీజెడ్‌సీ), సమ్మక్క (బీఏ), స్రవంతి (బీఏ), అనూష (బీఏ) పూర్వ విద్యార్థులు. పోలీసు ఉద్యోగం సాధించి వర్గల్ పూలే గురుకులానికి వన్నెలద్దిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు, వీపీ గోవిందరావు, అధ్యాపకులు అభినందించారు. ఇష్టపడి చదివితే ఆశించిన లక్ష్యం సిద్ధిస్తుందనడానికి తమ విద్యార్థులు నిదర్శనంగా వారు పేర్కొన్నారు.

ఇప్పటికే ఐదేళ్లు.. ఇంకా ఎన్నాళ్లు?

- కొమురవెల్లిలో 'వసతి' కలేనా?
- నత్తనడకన 50 గదుల భవన నిర్మాణ పనులు
- రూ.10.65 కోట్ల వ్యయంతో నిర్మించేందుకు అగ్రిమెంట్
- మూడు నెలల్లో జాతర ప్రారంభం
- దృష్టి సారించని అధికారులు

కొమురవెల్లిలో వసతి గృహం పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభించి ఐదేళ్లయినా పూర్తి కావడంలేదు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారుల అలసత్వమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. మరో మూడు నెలల్లో జాతర ప్రారంభం అవుతుండగా.. వసతి గృహం అందుబాటులోకి రాకపోవడంతో ఈసారీ భక్తులకు ఇబ్బందులు తప్పని దుస్థితి నెలకొంది.

– సాక్షి, సిద్దిపేట



కొమురవెల్లిలో నిర్మిస్తున్న 50 గదుల వసతి గృహం

కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయానికి జాతర సమయంలో రోజూ 30వేలకు పైగా భక్తులు వస్తుంటారు. బుధ, ఆదివారాల్లో సైతం 50వేలకు పైగా భక్తులు వస్తారు. ఆలయ పరిసరాల్లో దాతల సహకారంతో 140 కాటేజీలను నిర్మించగా అందులో కొన్ని శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుతం 75 కాటేజీలు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. జాతర సమయంలో దేవాలయ గదులు సరిపోవడం లేదు. దీంతో భక్తులు ప్రైవేట్ గదులను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేట్‌వారు రోజుకు రూ.5వేల నుంచి రూ.8వేలు వసూలు చేస్తున్నారు. కొందరు తప్పనిపరిస్థితుల్లో గదులు అద్దెకు తీసుకుని బోనం చేసి పట్నం వేసి, మొక్కులు చెల్లిస్తున్నారు. డబ్బులు వెచ్చించలేని భక్తులు చెట్ల కిందనే బోనం వండి మొక్కులు చెల్లించి వెళ్తున్నారు. భక్తుల ఇబ్బందులు పడుతుండటంతో దేవాలయం ఆధ్వర్యంలో రూ.10.65 కోట్ల వ్యయంతో 50 గదుల నిర్మాణాన్ని బండ్లగుట్టపై చేపట్టారు. 2018లో జీ ప్లస్‌టూతో నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి పనులు అగుతూ సాగుతూ వస్తున్నాయి. ఐదేళ్లు పూర్తవుతున్నా ఇంకా గదుల నిర్మాణం పూర్తి కాలేదు. మరోవైపు సరైనా నాణ్యత ప్రమాణాలు పాటించకుండానే నిర్మాణం చేస్తున్నా పంచాయతీ రాజ్ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. నిర్మాణంలో ఇసుకకు బదులుగా ఎక్కువగా డస్ట్‌నే వినియోగిస్తున్నారు. స్థానికంగా తయారు చేసిన సిమెంట్ ఇటుకలనే వినియోగిస్తుండటం గమనార్హం. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు.

త్వరలో పూర్తి..

> కొమురవెల్లిలో 50గదుల వసతి గృహ నిర్మాణం త్వరలో పూర్తవుతుంది. స్థలం కోసం కొంత ఆలస్యమైంది. పనులు వేగంగా కొనసాగుతున్నాయి. జాతర నాటికి అందించేందుకు కృషి చేస్తాం.
>
> –శ్రీనివాస్ రెడ్డి, డీఈ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్

రెండు సార్లు అగ్రిమెంట్ పొడిగింపు

2020లోనే నిర్మాణం పూర్తి చేసి ఇస్తానని సదరు కాంట్రాక్టర్ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖతో అగ్రిమెంట్ చేసుకున్నారు. ఇప్పటికే రెండు మార్లు కాంట్రాక్టర్‌కు పొడిగింపు ఇచ్చారు... ఈ నెలాఖరులోగా ముగియనుంది. సదరు కాంట్రాక్టర్ పనులు నెమ్మదిగా చేస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. మరో మారు పొడిగించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ రాజ్ ఉన్నతాధికారులు స్పందించి జాతర సమయానికి 50 గదుల వసతి గృహం వినియోగంలోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

దుబ్బాక ఎమ్మెల్యేను అరెస్టు చేయాలి

సీపీ శ్వేతకు ఫిర్యాదు


సీపీ శ్వేతకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

సిద్దిపేటకమాన్‌: రైల్వే స్టేషన్‌ ఘటనలో గొడవ సృష్టించిన దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌ రావు, అతడి అనుచరులను వెంటనే అరెస్ట్‌ చేయాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు మెర్గు మహేష్‌, స్థానిక మున్సిపల్‌ కౌన్సిలర్లు నాయిని చంద్రం, సాకి ఆనంద్‌, జువన్న కన కరాజు డిమాండ్‌ చేశారు. పోలీసు కమిషనర్‌ కార్యాలయంలో సీపీ శ్వేతకు, సిద్దిపేట టూటౌన్‌ పోలీసు స్టేషన్‌లోను వారు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 3న సిద్దిపేట దశాబ్దాల కల నెరవేరుతుందని ప్రజలు సంబరాలు చేసుకుంటున్న తరుణంలో ఎమ్మెల్యే రఘునందన్‌ రావు, తన అనుచరులతో వచ్చి విధ్వంసం సృష్టించారని ఆరోపించారు. అరాచకానికి ఆయన ఆజ్యం పోశారని, అయనతో పాటు గొడవ సృష్టించిన బీజేపీ శ్రేణులను అరెస్ట్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. రైల్వే స్టేషన్‌, రైల్వే లైన్‌ ఏర్పాటుకు సీఎం కేసీఆర్‌, మంత్రి హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.330 కోట్లు నిర్మాణ వ్యయంగా, భూసేకరణకు మరో రూ.310 కోట్లు విడుదల చేయించారన్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్‌వీ మండల అధ్యక్షుడు బండి శ్రీకాంత్‌, సోషల్‌ మీడియా కన్వీనర్‌ గుడిమల్ల రాజలింగం, కొంచం రమేష్‌, దబ్బుట మహేష్‌, వాటు ప్రశాంత్‌ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్‌ క్రీడల్లో..


విద్యార్థులకు కప్‌ను అందజేస్తున్న జోగు ప్రభుదాస్‌, కౌన్సిలర్లు


దుబ్బాక: జిల్లా స్థాయి స్కూల్‌ గేమ్‌ ఫెడరేషన్‌ (ఎస్‌జీఎఫ్‌) వాలీబాల్‌ అండర్‌ –17 బాలికల విభాగంలో ధర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. సిద్దిపేట మినీ స్టేడియంలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో మండలం నుంచి పాల్గొని జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. కౌన్సిలర్లు బత్తుల స్వామి, కనకయ్య, కోఆప్షన్‌ సభ్యురాలు పెంటమ్మ విద్యార్థులకు కప్‌, మెడల్స్‌ అందజేసి అభినందించారు. హెచ్‌ఎం శ్రీనివాస్‌, పీఈటీ నరేష్‌ను మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్‌ అభినందించారు.

బాలికలే చాంపియన్‌

వర్గల్‌(గజ్వేల్‌): వర్గల్‌ జ్యోతిబాపూలే గురుకులంలో గురువారం ఉమ్మడి జిల్లాస్థాయి అండర్‌–14 బాలికల ఆటల పోటీలు నిర్వహించారు. ఆతిథ్య వర్గల్‌ గురుకుల విద్యార్థినులు అత్యధిక పోటీలలో అద్భుత ప్రతిభ కనపరచి ఓవరాల్‌ చాంపియన్‌షిప్‌ దక్కించుకున్నారు. వర్గల్‌ విద్యార్థిని శ్రీజ వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ కైవసం చేసుకుంది. విజేతలకు ఆర్సీఓ ప్రభాకర్‌ బహుమతులు ప్రదానం చేశారు. గురుకుల ప్రిన్సిపాల్స్‌ లక్ష్మీదేవి, భాస్కర్‌రావు విద్యార్థులను అభినందించారు.


చాంపియన్‌షిప్‌ సాధించిన వర్గల్‌ విద్యార్థినులు

ప్రకంపనలతో బెంబేలు


భూమి కంపిస్తున్నది బిలాల్‌పూర్‌ గ్రామంలోనే

- సంగారెడ్డి – కర్నాటక సరిహద్దు గ్రామాల్లో..
- రెండేళ్లలో మూడుసార్లు కంపించిన భూమి
- భయంతో బయటకు పరుగులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలోని కోహీర్‌ మండలంలో భూప్రకంపనలు స్థానికులను భయకంపితులను చేస్తున్నాయి. మండలంలోని గొడిగార్‌పల్లి, మనియార్‌పల్లి, బిలాల్‌పూర్‌, బెడంపేట్‌ తదితర గ్రామాల్లో తరచూ భూమి కంపిస్తోంది. వికారాబాద్‌ జిల్లా పరిధిలోని మర్పల్లి గ్రామంలోనూ అదే పరిస్థితి. ఆ గ్రామాలకు సమీపంలోనే కర్నాటక ఉంటుంది. మంగళవారం ఢిల్లీలో కూడా భూమి కంపించింది. అవేవిధంగా సంగారెడ్డి జిల్లాలోని కర్నాటక సరిహద్దు గ్రామాల్లోనూ ఇలాంటి ప్రకంపనలు తరచూ చోటు చేసుకోవడం స్థానికులను ఆందోళనలకు గురిచేస్తున్నాయి.

ఏడాదిలో రెండుసార్లు..

ఈ ప్రాంతంలో ఏడాదిలో రెండు సార్లు భూప్రకంపనలు చోటు చేసుకున్నాయి. గొడిగార్‌పల్లిలో 2022 డిసెంబర్‌లో ఒకసారి, నెల రోజుల క్రితం మరోసారి భూమి కంపించిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ ప్రకంపనలు కొన్ని సెకన్ల పాటే ఉండడంతో పెద్దగా ప్రమాదమేమీ సంభవించలేదు. ఇళ్లలోని వంట సామాన్లు, గోడగడియారాలు, గోడలకు తగిలించిన ఫొటోలు కింద పడిపోయాయని వారు వాపోతున్నారు. మనియార్‌పల్లి, బిలాల్‌పూర్‌, బెడంపేట్‌ తదితర గ్రామాల్లో కూడా భూమి కంపించింది. ప్రకంపనలు చోటు చేసుకున్న ప్రతిసారి స్థానికులు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీస్తున్నారు. 20 ఏళ్ల కిత్రం కూడా ఇలాగే తమ గ్రామాల్లో భూప్రకంపనలు చోటు చేసుకున్నాయని పలువురు సీనియర్‌ సిటిజన్‌లు చెపుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

ఈ ప్రాంతంలో తరచూ భూ ప్రకంపనలు చోటు చేసుకుంటున్నప్పటికీ సంబంధిత శాఖ ఉన్నతాధికారులెవరూ పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ప్రకంపనల తీవ్రత తక్కువగా ఉన్నప్పటికీ, తరచూ ప్రకంపనలు చోటు చేసుకోవడం వెనుక కారణాలను విశ్లేషించాలని అధికారులు పేర్కొంటున్నారు. రిక్టర్‌ స్కేల్‌ మీద నమోదయ్యే స్థాయిలో ప్రకంపనలు ఉండడం లేదని స్థానిక అధికారులు చెపుతున్నారు.

ఏడాదిలో రెండు సార్లు...



నెల రోజుల క్రితం మా గ్రామంలో భూమి కంపించింది. 2022 డిసెంబర్‌లోనూ ప్రకంపనలు కొనసాగాయి. ఏడాది కాలంలో రెండు సార్లు భూమి కంపించడంతో భయంగా ఉంటోంది. నెల రోజుల క్రితం భూమి కంపించడంతో మరింత భయపడ్డాం. మా ప్రాంతంలో తరచూ ఎందుకు భూమి కంపిస్తోందో కారణాలు తెలుసుకుని అధికారులు ప్రజలకు వివరించాలి.

– మరెల్లి జైపాల్‌, గొడిగార్‌పల్లి గ్రామవాసి, సంగారెడ్డి

బయటికి పరుగులు తీశాం..



గత తొమ్మిది నెలల క్రితం మూడు నాలుగు సెకండ్ల పాటు భూమి కంపించింది. భూ ప్రకంపనలతో ధాటికి తలుపులు కిటికీలు కొట్టుకున్నాయి. వంట సామాగ్రి కింద పడ్డాయి. భయంతో ఇండ్ల నుంచి బయటకు వచ్చాము. రాత్రి వేళల్లో నిద్రలో ఉన్నప్పుడు వస్తే మా పరిస్థితి ఏంటీ.. రాష్ట్ర ఉన్నతాధికారులు చొరవ చూపి ఇక్కడ తరచూ ఎందుకు ప్రకంపనలు వస్తున్నాయో తెలుసుకుని చెప్పాలి.

– చేనువాల సత్యనారాయణరెడ్డి, మనియార్‌పల్లి గ్రామం, సంగారెడ్డి


డ్రైవింగ్‌ లైసెన్స్‌, హెల్మెట్‌ అందజేస్తున్న ఎంపీ

మాటలు నమ్మి మోసపోతే..

- అభివృద్ధి ఐదేళ్ల వెనకకు..
- మెదక్‌ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దౌల్తాబాద్‌ (దుబ్బాక): కాంగ్రెస్‌, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మి ఓట్లువేస్తే అభివృద్ధిలో ఐదేళ్లు వెనకకు పోవడం ఖాయమని మెదక్‌ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మల్లేశంపల్లిలో గాంధీ, అంబేద్కర్‌, తల్లి తెలంగాణ విగ్రహాల ఆవిష్కరణ, అలాగే పలు గ్రామాల్లో కుల సంఘాల భవనాలకు భూమి పూజ కార్యక్రమాల్లో గురువారం ఆయన పాల్గొన్నారు. మండలంలోని మల్లేశంపల్లిలో సర్పంచ్‌ దార సత్యనారాయణ ఏర్పాటు చేసిన మహాత్మగాంధీ, అంబేద్కర్‌, తల్లి తెలంగాణ విగ్రహాలను ముఖ్య అతిథిగా హాజరై సోలిపేట సుజాత రామలింగారెడ్డితో కలిసి విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. దుబ్బాక ఉపఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపిస్తే అభివృద్ధిలో వెనకకు వెళ్లామని, ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకు వచ్చే కాంగ్రెస్‌, బీజేపీ మాయ మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచుతానన్నారు. అనంతరం మల్లేశంపల్లిలో ముద్దిరాజ్‌, ఎరుకల సంఘం భవనం, ముబారస్‌పూర్‌లో రజక సంఘ భవనం, హైమద్‌నగర్‌లో పంచాయతీ భవన నిర్మాణాలకు భూమిపూజ చేశారు. అదే విధంగా హైమద్‌నగర్‌ పంక్షన్‌ హాల్‌లో ఎంపీ సొంత డబ్బులతో యువకులకు టూవీలర్‌ డ్రైవింగ్‌ లెర్నింగ్‌ లైసెన్స్‌, హెల్మెట్‌లను అందజేశారు. ముబారస్‌పూర్‌, హైమద్‌నగర్‌ గ్రామంలో పలు బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయాలు అందజేశారు. నిరుపేద కుటుంబాలు, పార్టీ కార్యకర్తలు,అధైర్యపడొద్దని, ఆపద సమయంలో అండగా ఉంటానని ఆయన బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగాధరి సంధ్య, జెడ్పీటీసీ రణంజ్యోతి, ఏఎంసీ చైర్మన్‌ ఇప్ప లక్ష్మీ, జెడ్పీ కో–ఆప్షన్‌ సభ్యుడు రహీమొద్దీన్‌, సర్పంచ్‌లు యాదగిరి, ఇమాంబీ, పార్టీ మండల అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్‌, ఎంపీటీసీలు తిరుపతి, దేవేందర్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు మోహన్‌రావు, హనుమాండ్ల రాజిరెడ్డి, ఇప్పదయాకర్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులను నమ్మొద్దు

- సైబర్‌ నేరాలపై అప్రమత్తత అవసరం
- అడిషనల్‌ డీసీపీ మల్లారెడ్డి

చేర్యాల(సిద్దిపేట): సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని శాంతి భద్రతల అడిషనల్‌ డీసీపీ మల్లారెడ్డి సూచించారు. స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బాలికలు, మహిళల రక్షణ చట్టాలు, సైబర్‌ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని, సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవ్‌ టీజింగ్‌, గుడ్‌టచ్‌బ్యాడ్‌ టచ్‌, సోషల్‌ మీడియా, సైబర్‌ సెక్యూరిటీ, మైనర్‌ డ్రైవింగ్‌, డయల్‌ 100, డ్రగ్స్‌, గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాలు వంటి అంశాల గురించి విద్యార్థులకు వివరించారు. ఎవరైనా వేదించినా, హేళనగా మాట్లాడినా వెంటనే డయల్‌ 100, షీటీం వాట్సప్‌ నెంబర్‌ 8712667343, స్నేహిత మహిళ సపోర్ట్‌ కేంద్రం నెంబర్‌ 9494639498, మహిళ పోలీస్‌స్టేషన్‌ నెంబర్‌ 8712667435 ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీ సత్యనారాయణరెడ్డి, మహిళ పోలీస్‌ స్టేషన్‌ సీఐ దుర్గ, కళాశాల ప్రిన్సిపల్‌ అమరేందర్‌రెడ్డి, స్నేహిత మహిళ సపోర్ట్‌ కేంద్రం కౌన్సిలర్‌ వసంత, స్వరూప, ఉపాధ్యాయులు, హుస్నాబాద్‌ డివిజన్‌ షీ టీం సైదయ్య, కానిస్టేబుళ్లు స్వప్న, ప్రశాంతి, మల్లేశం, శివకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్‌లో టెస్టుల పేరుతో సైబర్‌ మోసం
– ఖాతా నుంచి రూ.20 వేలు స్వాహా

పటాన్‌చెరు టౌన్‌: 'ఆర్మీ వాళ్లం.. 25 మందికి ల్యాబ్‌ టెస్టులు చేయాలి' అంటూ వచ్చిన ఫోన్‌కాల్‌కు స్పందించిన పాపానికి ఒక ల్యాబ్‌ నిర్వాహకుడు రూ.20 వేలు పోగొట్టుకున్న ఘటన పటాన్‌చెరులో చోటు చేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం... ఓ స్థానిక ప్రైవేట్‌ ల్యాబ్‌లో రవి ల్యాబ్‌ మేనేజర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు బుధవారం ఓ ఫోన్‌ కాల్‌ వచ్చింది. 25 మంది ఆర్మీవాళ్లం తమ క్యాంపులో భాగంగా నందిగామకు వచ్చామని, అందరికీ టెస్టులు చేయాలని ఒక అపరిచితుడు అడిగాడు. దీంతో రవి తమ టెక్నీషియన్‌ను పంపించి చేయిస్తానన్నాడు. అయితే ల్యాబ్‌ను చూపించాలని అపరిచిత వ్యక్తి వీడియోకాల్‌ చేసి అడిగాడు. దీంతో రవి అలానే చూపించాడు. అయితే ఫోన్‌పే ద్వారా పేమెంట్‌ చెల్లిస్తానని.. వచ్చిన ఓటీపీని తనకు తెలపాలని ఆ వ్యక్తి చెప్పాడు. దీంతో రవి తన ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పడంతో వెంటనే అతడి ఖాతా నుంచి రూ.20 వేలు మాయం అయ్యాయి. దీంతో బాధితుడు రవి తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్‌ క్రైమ్‌ పోలీసులతో పాటు బ్యాంక్‌ అధికారులకు సమాచారం ఇచ్చి అనంతరం గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



విద్యార్థులకు సూచనలిస్తున్న అడిషనల్‌ డీసీపీ మల్లారెడ్డి

ఇద్దరికి గాయాలు...

వెల్దుర్తి(తూప్రాన్‌): బైక్‌ అదుపుతప్పి పడిపోవడంతో యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని చర్లపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మదుసూధన్‌గౌడ్‌ వివరాల ప్రకారం.. మాసాయిపేట మండలం బొమ్మారం గ్రామానికి చెందిన మట్టిల భాస్కర్‌ వెల్దుర్తి నుంచి శివ్వంపేట వైపు బైక్‌పై వెళ్తుండగా చర్లపల్లి గ్రామ శివారులో బైక్‌ అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని 108 వాహనంలో నర్సాపూర్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడినుంచి గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.


గాయపడిన భాస్కర్‌

ఆర్టీసీ బస్సు ఢీకొని..

నర్సాపూర్‌ రూరల్‌: బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటన నర్సాపూర్‌ –మెదక్‌ జాతీయ రహదారిలోని పెద్ద చింతకుంట వద్ద గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం ఎల్లారెడ్డిగూడ తండాకు చెందిన పంచాయతీ కార్మికుడు ఎరుకలి దశరథ బైక్‌పై నర్సాపూర్‌కు వచ్చి వెళుతున్న క్రమంలో పెద్ద చింతకుంట వద్ద జాతీయ రహదారి నుంచి ఎల్లారెడ్డి గూడ వెళ్లేందుకు రోడ్డ క్రాస్‌ అవుతున్న క్రమంలో మెదక్‌ వైపు నుంచి వస్తున్న మెదక్‌ డిపో ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. గాయపడిన దశరథను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు.


గాయపడిన దశరథ

వ్యక్తి అదృశ్యం


మచ్చ కనకయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామానికి చెందిన మచ్చ కనకయ్య (46) గత 3న సాయంత్రం తన తమ్ముడు నర్సింహులు కొడుకు కార్తీక్‌తో కలిసి అల్వాల్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా లింగుపల్లి బస్టాప్‌ వద్ద ఆగారు. కనకయ్య తాను మిరుదొడ్డికి వెళ్ళి వస్తానని చెప్పి కార్తీక్‌ను మల్లుపల్లికి పంపించాడు. రాత్రయినా ఇంటికి తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు మరియమ్మ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్‌ తెలిపారు.


ప్రజా ఆమోదమే ప్రధానం

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికకు కేంద్ర అనుమతి అవసరం లేదని, ఆ రాష్ట్ర ప్రజల ఆమోదం ఉంటే సరిపోతుందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక పీఎంఆర్‌ ఫంక్షన్‌ హాలులో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల నిజామాబాద్‌ సభలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్‌ఎస్‌దే మళ్లీ అధికారమన్నారు. కేసీఆర్‌ అనంతరం సీఎంగా బాధ్యతలు చేపట్టేది కేటీఆరే అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ స్వరూపరాణి, వైస్‌ చైర్మన్‌ రాజీవ్‌రెడ్డి, వైస్‌ ఎంపీపీలు నవీన్‌రెడ్డి, రాజెందర్‌రెడ్డి, కౌన్సిలర్లు నరెందర్‌, జుబేదా, సతీష్‌గౌడ్‌, మార్కెట్‌ వైస్‌ చైర్మన్‌ వెంకట్‌రెడ్డి, ప్రజా ప్రతినిదులు, మహిళలు పాల్గొన్నారు.


బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, చైర్‌ పర్సన్‌

బతికే ఉన్నా..చంపేశారు!

హుస్నాబాద్‌రూరల్‌: ప్రభుత్వం రైతులకు రుణాలను మాఫీచేసి వారిని ఆదుకుంటోంది.. కాని ఒక రైతు బతికే ఉన్నా చనిపోయినట్టు నమోదుచేశారు. దీంతో రుణమాఫీ అందక ఇబ్బంది పడుతున్నాడు జిల్లెలగడ్డకు చెందిన రైతు బొల్లి కొమురయ్యది కూడా అదే పరిస్థితి. తనకు రుణమాఫీ కాలేదని గురువారం ఆయన హుస్నాబాద్‌ యూనియన్‌ బ్యాంక్‌ అధికారులను సంప్రదించాడు. బ్యాంకు అధికారులు కొమురయ్య వివరాలను పరిశీలించి అందులో ఆయన మరణించిన తర్వాత పంట రుణం మంజూరైనట్లు నమోదు కావడం వల్ల రుణం మాఫీ కాలేదని చెప్పడంతో రైతు నిర్ఘాంత పోయాడు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో బ్యాంకు అధికారులు వ్యవసాయ అధికారులను సంప్రదించాలని చెప్పడంతో కొమురయ్య వ్యవసాయ కార్యాలయానికి వెళ్లి సంప్రదించగా వారు బ్యాంకులోనే అడగాలని చెప్పి పంపించేశారు. 2017 సెప్టెంబరు 20న బ్యాంకులో రూ.లక్ష పంట రుణం తీసుకుని ప్రతి ఏటా రెగ్యులర్‌గా రెన్యువల్‌ చేసుకుంటూ వస్తున్నాడు. తాను మరణించినట్లు నమోదు చేస్తే మరి పంట రుణం ఎలా రెన్యువల్‌ చేశారని ప్రశ్నించాడు. దీనిపై కలెక్టర్‌ ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పాడు. అయితే మండలంలో ఇలాంటి కేసులు ఏడు వరకు ఉన్నాయని, వాటి గురించి ఉన్నతాధికారులకు తెలిపామని ఏఓ నాగరాజు తెలిపారు.


ఏఓ నాగరాజుతో మాట్లాడుతున్న రైతు

ఆరు గ్యారంటీల ప్రచారం

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఆరు గ్యారంటీలు ప్రకటించామని ఏఐసీసీ కార్యదర్శి, కరీంనగర్‌ పార్లమెంట్‌ ఇంచార్జి క్రిస్టోఫర్‌ తిలక్‌ తెలిపారు. బెజ్జంకిలో గురువారం పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తలు, బూత్‌ లెవల్‌ ఏజంట్ల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూకాంగ్రెస్‌ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల గురించి కార్యకర్తలకు అందరికీ వివరించాలని సూచించారు. కార్యక్రమంలో కరీంనగర్‌ డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్‌ ఇంచార్జి కవ్వంపెల్లి సత్యనారాయణ, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్‌ తదితరులు పాల్గొన్నారు.

12 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

– రూ.62 వేల 488 స్వాధీనం

అల్లాదుర్గం(మెదక్‌): పేకాట స్థావరంపై దాడిచేసి 12 మందిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి చెప్పారు. గురువారం అల్లాదుర్గం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని గడిపెద్దాపూర్‌ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు స్థానికుల సమాచారం మేరకు దాడి చేసినట్లు ఆయన తెలిపారు. పేకాడుతున్న బేగరి ప్రభాకర్‌, మంగిలి శ్రీరాం, నరేశ్‌, మల్లేశ్‌, బేగరి బాబుతో పాటు మరో ఏడుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.62 వేల 488 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో 8 మంది మృతి

లారీ ఢీకొని కౌలు రైతు...


పిట్ల శ్రీనివాస్‌ (ఫైల్‌)

మిరుదొడ్డి(దుబ్బాక): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఒక కౌలు రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షులు, స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పిట్ల శ్రీనివాస్‌ (45) వ్యవసాయ పనులు ముగించుకుని స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాల నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండా మిరుదొడ్డి నుంచి చెప్యాల క్రాస్‌ రోడ్డు వైపు బియ్యం లోడుతో వెళుతున్న లారీ ఢీకొట్టింది. దీంతో శ్రీనివాస్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు..


సాయికుమార్‌ (ఫైల్‌)


నవీన్‌ (ఫైల్‌ఫోటో)

ములుగు(గజ్వేల్‌): ములుగు మండలం తున్కిబొల్లారం గ్రామ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్టు ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నర్సాపూర్‌ గ్రామానికి చెందిన చెద్రి సాయికుమార్‌(22), పొడిపల్లి నవీన్‌(22) ఒక ప్రైవేట్‌ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. వారిద్దరూ కలసి బైక్‌పై బుధవారం రాత్రి 11.40 సమయంలో వంటిమామిడివైపు వెళ్తుండగా బైక్‌ను నడుపుతున్న సాయికుమార్‌ తున్కిబొల్లారంలో రోడ్డు పక్కన గల ఓ గోడను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సాయికుమార్‌ అక్కడికక్కడే మృతి చెందగా నవీన్‌ను హైద్రాబాద్‌ అమీర్‌పేట్‌లోని ప్రైవేట్‌ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న నవీన్‌ గురువారం రాత్రి 7 గంటల సమయంలో మృతి చెందాడు. వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.


చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

అక్కన్నపేట(హుస్నాబాద్‌): మద్యానికి బానిసై మనస్తాపం చెందిన ఒక వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని గండిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ తాండ్ర వివేక్‌ తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన కర్లకంటి రమేష్‌(32) గత 3 రాత్రి తన ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. దీంతో హుటాహుటిన హుస్నాబాద్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. భార్య మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బైక్‌ ఢీకొట్టిన ఘటనలో...

మనోహరాబాద్‌(తూప్రాన్‌): పోలీస్‌స్టేషన్‌ పరిధిలో పాలట గ్రామానికి చెందిన సబ్బు రాములు (65) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం మనోహరాబాద్‌ వద్ద ఆటోదిగి యూటర్న్‌ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో తూప్రాన్‌ నుంచి హైదరాబాద్‌ వైపు వెళుతున్న గుర్తుతెలియని బైక్‌ ఢీ కొట్టింది. స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. అతడి భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

అప్పుల భారంతో రైతు..


మృతి చెందిన రైతు పరశురాములు

మిరుదొడ్డి(దుబ్బాక): వ్యవసాయం కోసం చేసిన అప్పులు చేసి వాటిని తీర్చేదారిలేక మస్తాపంతో పురుగుల మందు తాగి ఒక రూతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లిలో గురువారం జరిగింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, భూంపల్లి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం. గ్రామానికి చెందిన కట్టె పరశు రాములు వ్యవసాయం కోసం సుమారు రూ.3 లక్షల వరకు అప్పులు చేసి రెండు బోర్లు వేయించాడు. బోరు బావుల్లో నీరు పడక పోవడంతో నిరాశ చెందాడు. పంటలు పండక పోవడం, చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెందేవాడు. ఈ క్రమంలో గత 3న ఇంటి నుంచి వెళ్లిన ఆయన ఇంటికి తిరిగి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు వెతుకుతున్న క్రమంలో 4న ఉదయం వ్యవసాయ పొలం వద్ద అపస్మారక స్థితిలో పరశు రాములు కొట్టు మిట్టాడుతూ కనిపించాడు. అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగినట్లు ఆయన కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో హుటాహుటిన సిద్దిపేటలోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న రైతు మృతి చెందాడు. అతడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు భూంపల్లి ఎస్‌ఐ భువనేశ్వర్‌రావు తెలిపారు.

తాగిన మైకంలో..

కోహీర్‌ (జహీరాబాద్‌): తాగిన మైకంలో మురుగు కాలువలో వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణ శివారులో వైకుంఠ ధామం వద్ద గురువారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సురేష్‌ కథనం ప్రకారం జజ బోయిని శేఖర్‌(35) పట్టణంలోని ఇస్పానివాసి. వ్యసాయ కూలీపనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో పొలం పనులకు వెళుతూ మార్గమధ్యంలో మురుగు కాలువను దాటుతుండగా ప్రమాదవశాత్తూ అందులోపడి మరణించాడు. అతడి భార్య జగదీశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

అనారోగ్యంతో డిగ్రీ విద్యార్థి..


రాజు(ఫైల్‌)

పాపన్నపేట(మెదక్‌): అనారోగ్యంతో ఓ డిగ్రీ విద్యార్థి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఆరెపల్లిలో బుధవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన మశికరి రాజు(19) ఓపెన్‌ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నాలుగు రోజుల క్రితం పరిస్థితి ఇబ్బందిగా మారడంతో మెదక్‌లోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం బుధవారం సాయంత్రం హైద్రాబాద్‌ తరలించగా అక్కడ మరణించాడు. గురువారం మెదక్‌ ఎమ్మెల్యే వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

నిందితుడికి ఒక రోజు జైలు

వెల్దుర్తి(తూప్రాన్‌): స్థానిక బాలాజి ఫంక్షన్‌హాల్‌ ఎదురుగా గతేడాది అనుమతులు లేకుండా ఈత చెట్లు తొలగించడంపై అప్పట్లో భూ యజమాని యాదగిరిపై రామాయంపేట ఎక్సైజ్‌ అధికారులు కేసు నమోదు చేశారు.దానికి సంబంధించి ఎక్సైజ్‌ అధికారులు సాక్ష్యాలు రుజువుచేయడంతో యాదగిరికి ఒక రోజు జైలు శిక్ష లేదా రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారని ఎక్సైజ్‌ ఎస్‌ఐ విజయ్‌సిద్దార్థ్‌ ఒక ప్రకటనలో తెలిపారు.